జనవరి 08, 2004

## "కరెన్సీ నోట్లను ప్యాకెట్లుగా కుట్టిన/స్టెపుల్ చేసిన బ్యాంకులు శిక్షార్హులు" రిజర్వు బ్యాంకు ప్రకటన

కరెన్సీ నోట్లను ప్యాకెట్లుగా కుట్టి, చలామణీ చేయడం నిషేధించినట్లు రిజర్వు బ్యాంకు పునరుద్ఘాటించింది. బ్యాంకులు గాని, వాటి శాఖలు గాని ఇటువంటి ప్యాకెట్లను ఇవ్వడం గాని, తీసుకోవడం గాని చేయరాదని బ్యాంకు తెలిపింది. ఒకవేళ, ఏదైనా బ్యాంకు లేదా బ్యాంకు శాఖలు ప్యాకెట్లుగా కుట్టిన నోట్లను ఇవ్వడం, పుచ్చుకోవడం వంటి దృష్టాంతాలు రిజర్వు బ్యాంకు దృష్టికి వచ్చిన యెడల, అట్టి బ్యాంకులను ప్రస్తుతం అమలులో ఉన్న బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 ప్రకారం విచారించి, శిక్షిస్తామని బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది.

అన్ని వాణిజ్య, గ్రామీణ, స్థానిక బ్యాంకులను, కరెన్సీ నోట్లకు స్టేపుల్ చేసే విధానానికి స్వస్తి పలికి, దానికి బదులు కాగితపు బ్యాండులను నోటు ప్యాకెట్లకు చుట్టాలని గత సంవత్సరం రిజర్వు బ్యాంకు, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, సెక్షన్ 35 ఎ క్రింద తనకు సంక్రమించిన అధికారాల్ని వినియోగించుకొంటూ ఆదేశాల్ని జారీ చేసింది. ప్రజలకు పరిశుభ్రమైన నోట్లను మాత్రమే జారీ చేయాలని, నోట్ల పై గల 'వాటర్ మార్క్' ప్రాంతంలో ఏవిధమయిన రాతలు వ్రాయరాదని బ్యాంకుల్ని రిజర్వు బ్యాంకు కోరింది. ఇటీవల కొన్ని పట్టణ, రాష్ట్ర జిల్లా సహకార బ్యాంకులు నోట్లు ప్యాకెట్లను స్టేపుల్ చేసి, చలామణి చేస్తున్నట్లు బ్యాంకుకు ఫిర్యాదులు అందుతున్నాయి.

కరెన్సీ నోట్లను ఈవిధంగా కుట్టడం లేదా స్టేపుల్ చేయడం వల్ల, వాటి

జీవిత కాలం తగ్గడంతో పాటు, అటువంటి ప్యాకెట్లను విప్పడం వినియోగదారులకు కష్ట సాధ్యమవుతుంది. నోట్లు తొందరగా శిధిలమయ్యే అవకాశమూ ఉంది.

**అజిత్ ప్రసాద్**
మేనేజర్

పత్రికా ప్రకటన : 2003 - 2004/841